## జమే(జిమ్మే)దారి కోయిలకు

# జై కొట్టిన తెలంగాణ జనత

### ఎల్కతుర్తి సభలో కేసీఆర్ కు జననీరాజనం

ఎల్కతుర్తి సభతో మరో సారి కేసీఆర్ తన ఉనికిని చాటుకున్నారు.జనం హృదయంలో తన స్థానం పదిలంగా ఉందని మరో సారి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిరూపించుకున్నారు.శాసనసభ ఎన్నికల్లో ఓటమి తరువాత ఫార్మ్ హౌజ్ కే పరిమితమైన కేసీఆర్ ఏడాదిన్నర తర్వాత ప్రజల్లోకి రావటం తో జనం నీరాజనం పట్టారు.'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'అనే శ్లోకం స్ఫూర్తితో ఎవ్వరు ఎన్నికష్టాలు పెట్టినా రాష్ట్రాన్ని సాధించు కున్నామని కేసీఆర్ తెలిపారు.ప్రజలు దీవిస్తే పదేండ్లలో తెలంగాను దగదగ లాడించాం.అందరూ ఆశ్చర్య పోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం అన్నప్పుడు కార్యకర్తలు జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అయితే ఈ సభలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఎలావుందో పూసగుచ్చి నట్లు వివరించారు.గడ్డి గాడిదలకు వేసి బర్రెల నుంచి పాలు పితికిన రీతిగా ఉందని అన్నప్పుడు ప్రజలనుంచి ప్రతిస్పందన బాగా వచ్చింది.అలాగే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని అయిష్టంగానే ఇచ్చిందని మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ విధానాలు మనకు వ్యతిరేకంగానే ఉన్నాయంటూ కాంగ్రెస్ విధానాలపై కేసీఆర్ ధ్వజమెత్తినప్పుడు ప్రజలు కరతాళ ధ్వనులు చేశారు.అయితే ఈ ప్రభుత్వాన్ని మేం పడగొట్టబోమని వారు చేసే తప్పిదాల వల్లే ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.మధ్య మధ్యలో కార్యకర్తలు సీఎం,సీఎం అంటూ నినాదాలు చేస్తుండగా వారిని గట్టిగానే వారించే ప్రయత్నం చేశారు.మేము గవర్నమెంట్ ను పడగొట్టం.తెలంగాణ సమాజం అద్భుతంగా పురోగమించేదాక తెలంగాణ సమాజం కృషిచేయాలి.నా ముందే ఇలా జరుగుతుంటే నేను చూస్తూ వూరుకోను అంటూ ఆవేదన చెందారు.ఇకనుంచి ఎందా కయినా కొట్లాడుతా అంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు.

తమ 10 ఏళ్ల పరిపాలనలో ఏ ఏ రంగంలో ఎలా అభివృద్ధి చెందామో కేసీఆర్ వివరించారు. ముఖ్యంగా విద్యుత్ రంగం,వ్యవ సాయ రంగం,నీటి పారుదల రంగం,ఐటీ రంగం,విద్యా, వైద్య రంగాల్లోతమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి చెప్పారు.తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పెంచామన్నారు. తెలంగాణలో భూముల ధరలు బాగా పెరిగాయని ఇప్పుడు కాంగ్రెస్ పరిపాలన ఏడాదిలోపే పాతాళానికి దిగ జారాయని విమర్శించారు.కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఎలాంటి ఇబ్బందులు పెట్టకూడదనే ఈ ప్రభుత్వాన్ని నేను విమర్శించలేదని స్పష్టం చేశారు.కనీసం ఏడాదిన్నర టైమ్ ఇచ్చాను.ఇది కాకుండా కేసీఆర్ నీవు అసెంబ్లీకి రా అంటూ నా పై విమర్శలు గుప్పిస్తున్నారు.వీరు చెప్పే సోదికబుర్లు వినడానికి రావాలా అంటూ తీవ్రంగా విమర్శించారు.మేం చేసిన అభివృద్ధి ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించటం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో ఫెయిల్ అయ్యిందని విమర్శించటంతో కార్యకర్తలు కరతాళా ధ్వనులు చేశారు.అలాగే బీజేపీ పైకూడా కేసీఆర్ విమర్శలు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ళు అయినా రాష్ట్రానికి 11 రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు.శుష్కప్రియాలు శూన్యహస్తాలు తప్ప చేసిందేమీ లేదన్నారు.తల్లిని చంపి బిడ్డను బతికించారని మోడీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఎద్దవా చేశారన్నారు. ఛతీస్ గఢ్ లో కగార్ పేరుతో నక్సల్స్ పై జరుగుతున్న దాడులు ఆపాలని కేంద్రాన్ని కోరారు.మొత్తం మీద కేసీఆర్ ప్రసంగం అనుకున్నంత స్థాయిలో లేదని పలువురు నిరుత్సాహం వ్యక్తం చేశారు.అయితే ఇది పార్టీ రజతోత్సవ సభ అయినందున తమ పార్టీ విధానాలను తెలిపే విధంగా కేసీఆర్ ప్రసంగం ఉందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఇక ముందు ముందు వాడీ వేడి ప్రసంగాలు ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

-ఎస్.వి.రమణా చారి

# గులాబి రజతోత్సవ సభ.. గ్రాండ్ సక్సెస్

### అశేషంగా తరలివచ్చిన జనవాహిని .. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం. కార్యకర్తల్లో జోష్

హుజురాబాద్ ఏప్రిల్ 27 జనతా న్యూస్: హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరైన భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభ విజయవంతమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ప్రజలు బహిరంగ సభకు తరలివచ్చారు. బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున జన సమీకరణ చేశారు. సభకు వచ్చిన వారిలో సుమారు 70% యువతే కావడం విశేషం. సభలో రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో పాడిన తెలంగాణ పాటలు యువతను ఉ ర్రూతలూగించాయి. సభా ప్రాంగణం మొత్తం జనంతో నిండిపోయింది. ఎటు చూసినా లక్షలాది జనం కనిపించారు. అతిపెద్ద వేదికపై అందరూ ఆశీర్నులయ్యారు. కెసిఆర్ హెలికాప్టర్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. ఆయనకు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కెసిఆర్ ప్రసంగానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతున్నంత సేపు సీఎం సీఎం యువత పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఒక దశలో కెసిఆర్ అసహనం వ్యక్తం చేశారు. కెసిఆర్ కాంగ్రెస్ పై బిజెపి పై విమర్శలు చేసిన సందర్భంగా సభికుల నుండి మంచి స్పందన లభించింది. కెసిఆర్ ఎక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పలకకపోవడం గమనార్హం. సభకు హాజరైన ప్రజానీకానికి కెసిఆర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ శ్రేణులకు రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత సభా ప్రాంగణంలోకి వచ్చినప్పుడు ప్రజలు అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సభ పూర్తయిన తర్వాత విజయసంకేతంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. సభ పూర్తయిన తర్వాత ఎలుకతుర్తి నుంచి హనుమకొండ వరకు అలాగే హుజురాబాద్ వరకు హుస్నాబాద్ వరకు ట్రాఫిక్ పెద్ద ఎత్తున జామ్ అయింది. ఎక్కడి వాహనాలు అక్కడ



నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కెసిఆర్ సభ ముగిసిన తర్వాత కూడా వేలాదిమంది సభా ప్రాంగణానికి వస్తూ కనిపించారు. సుమారు పది లక్షల మందికి పైగా సభకు హాజరైనట్టుగా తెలుస్తోంది. ఊహించిన దానికంటే సభ ఎక్కువగా సక్సెస్ కావడంతో గులాబి స్టేషన్లో ఆనంద ఉ త్సాహాలు వ్యక్తం అవుతున్నాయి. కెసిఆర్ వేదిక మీదికి వచ్చిన తర్వాత ప్రజలు భారీకేట్లను దోచుకుని మీడియా గ్యాలరీ విఐపి గేలరీ వైపు రావడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. కెసిఆర్ హెలికాప్టర్ దిగిన తర్వాత కూడా బరికేట్లను తోసుకొని ప్రజలు ముందుకు వచ్చారు. దీంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావలసి వచ్చింది. మీడియా గ్యాలరీలో విఐపి గ్యాలరీ లోనూ.. కార్యకర్తలే కూర్చోవడంతో పాత్రికేయులు విఐపి లు అసహన వ్యక్తం చేశారు. రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో పాడిన పాటలు అందరిని అలరించాయి. అభిమానులు మహిళలు పాటలకు నృత్యాలు చేశారు. కొందరు విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్నారు. రైతులు ఎడ్ల బండ్లపై తరలిరావడం ఆకట్టుకుంది. సభ సక్సెస్ తో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. సభ సక్సెస్ కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సతీష్ కుమార్ వినయ్భాస్కర్ రవీందర్రావు పెద్ది సుదర్శన్ రెడ్డిలను కెసిఆర్ ప్రత్యేకంగా అభినందించారు. బహిరంగ సభకు భూములను ఇచ్చిన రైతులను కూడా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## బెజ్జంకి వాసికి గౌరవ డాక్టరేట్




జనత న్యూస్ బెజ్జంకి: మండల కేంద్రానికి చెందిన అనుబంధ గ్రామమైన పాపయ్యపల్లి నివాసి, దోనే శ్రీనివాస్ కి ఉదయపూర్ విశ్వవిద్యాలయం మరియు ప్రాగ్ జ్యోతిష్య విశ్వవిద్యాపీఠం శనివారం గౌరవ డాక్టర్ తో సత్కరించింది. జ్యోతిష్య విభాగంలో "ఆలస్య వివాహాలు, వైవాహిక జీవితంలో భార్యాభర్తల సమస్యల" పై చేసినటువంటి పరిశోధనకు ఈ అవార్డు వచ్చినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా శ్రీనివాస్ కరీంనగర్ పట్టణంలో పురోహితులుగా, వాస్తు జ్యోతిష్యాల లో సేవలు అందిస్తున్నారు.

# ప్రజా వాణి రద్దు

జగిత్యాల, జనతా న్యూస్: జగిత్యాల కలెక్టరేట్లో సోమవారం నాడు (28.04.2025)నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ %దీ%. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశముల ప్రకారం భూ భారతి అవగాహనా సదస్సులు జగిత్యాల జిల్లాలోని అన్ని మండలములో నిర్వహిస్తున్నందున అధికారులు భూ భారతి అవగాహన సదస్సులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గారు ప్రకటనలో వెల్లడించారు.

కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ కలెక్టరేట్లో సోమవారం (28.04.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూభారతి కొత్త ఆర్ఓఆర్ రెవిన్యూ చట్టం అమలు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందున, అధికారులంతా ఆ సదస్సులకు హాజరు కావలసిన ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆలయ చైర్మన్ ను సన్మానించిన స్నేహితులు



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవు ను ఆయన స్నేహితులు 1992-93 సంవత్సరానికి చెందిన పదవ తరగతి బ్యాచ్ మెంబర్స్ ఆదివారం ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడు ఆలయ కమిటీ చైర్మన్ గ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా పూర్తి చేసినందుకు సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో పక్కా ప్రణాళికతో ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల అండదండలతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. మాలో ఒక్కడైనా మా స్నేహితుడికి ఇలా దేవుడు సేవ చేసే అవకాశం రావడం సంతోషించదగ్గ విషయం అని, భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తమ స్నేహితుడు చేస్తున్న కృషికి తమ వంతుగా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

## బేగంపేట్లో నేతన్నల నూతన కార్యవర్గం

**అధ్యక్షులుగా బూర్ల జగదీష్, ఉపాధ్యక్షులుగా ఐల కిరణ్ కుమార్. వెల్దండి శ్రీనివాస్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామంలో ఆదివారం పద్మశాలి కులస్తులు, వారి కుల సంఘ ఎన్నికలు నిర్వహించినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలో గౌరవ అధ్యక్షులుగా మామిడాల జయరాం, గౌరవ ఉపాధ్యక్షులుగా మామిడాల మల్లేశం, మామిడాల రాములు ఎన్నిక కాగా, సంఘ అధ్యక్షులుగా బూర్ల జగదీష్, ఉపాధ్యక్షులుగా ఐల కిరణ్ కుమార్, వెల్దండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మంచి కట్ల శ్రీనివాస్, కోశాధికారిగా మామిడాల వెంకటేశం, ప్రచార కార్యదర్శిగా మెరుగు రజినీకాంత్ లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కమిటీ మాట్లాడుతూ, పద్మశాలీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని , ఐక్యతను కొనసాగిస్తామని, రానున్న రోజుల్లో తమవంతుగా గ్రామ అభివృద్ధిలో, సామాజిక సేవలో ముందుంటామని పేర్కొన్నారు.

## మునిగిపోయే నావ బిఆర్ఎస్ పార్టీ

### బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల శ్రీనివాస్



జనత న్యూస్ బెజ్జంకి : బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల పాలనకు విరక్తి చెందిన తెలంగాణ ప్రజలు, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కిం చారని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు పాతాళంలోకి తొక్కుతారని, మునిగిపోయే నావ లాంటి పార్టీకి రజితోత్సవాలు జరుపుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల శ్రీనివాస్ ఆదివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాల పాలనలో దోచుకున్న డబ్బుతో సభ నిర్వహిస్తున్నారని, బాధ్యతమైన ప్రతిపక్షంలో ఉండి కెసిఆర్ ఎందుకు ఇన్ని రోజులు ప్రజల మధ్యకు రాలేదని ప్రశ్నించారు. దళిత బంధు, దళిత ముఖ్యమంత్రి, బీసీ బందు, రైతు రుణమాఫీ, దళితులకు 3 ఎకరాల పొలం, డబుల్ బెడ్ రూమ్స్ ఇలా అనేక హామీలతో యావత్ తెలంగాణ సమాజాన్ని మోసం చేసి న బిఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తులో తెలంగాణలో స్థానం లేదని అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకొని సంతోషంలో యావత్ తెలంగాణ ప్రజలు ఉన్నారని, రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దే అని స్పష్టం చేశారు. రానున్న కాలంలో సుస్థిరమైన పరిపాలన తెలంగాణ ప్రజలకు అందించడానికి కాంగ్రెస్ పార్టీ సంసిద్ధంగా ఉ ందన్నారు.

